క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎరుకల బస్తీ, మెజెస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్స్ సమీప ప్రాంతం, ఆర్‌బీఐ ఎదురు లేన్, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, బల్కంపేట, సాయిబాబా టెంపుల్, రేణుకానగర్.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీఈ బిల్డింగ్, వెర్మాంట్ అపార్ట్‌మెంట్స్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, ప్రేమ్‌నగర్, గాయత్రీనగర్, అమీర్‌పేట సత్యం థియేటర్, మెయిన్‌రోడ్డు, బ్లూ ఫాక్స్ హోటల్, ప్రైమ్ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ప్యారడైజ్ డివిజన్ పరిధిలో..

సీసీనగర్, వైశ్రాయ్, నామాలగుండు, శ్రీనివాస్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో కోత ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణ రావు పేర్కొన్నారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఏజే కాలనీ 1, 2, రామాలయం, గాంధీనగర్, సీసీనగర్ కమ్యూనిటీ హాల్, ఉప్పలమ్మ టెంపుల్, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, ఆర్‌సీ కాంపౌండ్, నామాలగుండు వెంకటేశ్వర టెంపుల్, పద్మా గ్యాస్, అన్నానగర్, కిందిబస్తీ, నెహ్రూ హైస్కూల్.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వైశ్రాయ్ జీరా క్లబ్, గార్డెన్ ఏరియా, అన్నా విశ్వనాథం, మార్కండేయనగర్, ఫ్రైడే మార్కెట్, ఎస్వార్ హాస్పిటల్, రాఘవేంద్ర గార్డెన్, ఉప్పర్ బస్తీ, బాపన్‌బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

ఓయూ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య వివిధ పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. గత ఏడాది ఆగస్టులో జరిగిన 7 ఎంఏ, రెండు ఎమ్మెస్సీ కోర్సుల ఇంటర్నల్ పరీక్షల ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్లో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు విదేశాల్లో ఉద్యోగాలపై వర్క్‌షాప్

గాంధీఆస్పత్రి: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకామ్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ వివేకానంద ఆడిటోరియంలో నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు హెల్త్‌కేర్ సెక్టార్‌లో విదేశాల్లో ఉద్యోగాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు, క్వాలిఫికేషన్, అర్హత పరీక్షలు, రిక్రూట్‌మెంట్ నియమ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సికింద్రాబాద్: వారాసీగూడలోని శ్రీసాయి విద్యాలయ విద్యార్థులకు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకర్‌రాజు నేతృత్వంలో ట్రాఫిక్ విభాగం సిబ్బంది పాఠశాలకు వచ్చి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ఎదురయ్యే అనర్థాలు , డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందే విధానాలపై ట్రాఫిక్ సిబ్బంది పద్మావతి, కృష్ణ వివరించారు.

గాంధీ రోగులపై శీతకన్ను!

డైట్ ధరలు పెంచినా అందుబాటులోకి రాని వైనం

- మూడు నెలలుగా ఫైల్ పెండింగ్
- ఉన్నతాధికారుల తీరుపై రోగులు, వైద్యుల అసంతృప్తి
- వైద్యమంత్రి హరీష్‌రావు స్పందించాలని విజ్ఞప్తి



రోగులకు ఆహారం అందిస్తున్న దృశ్యం(ఫైల్)

గాంధీఆస్పత్రి: నిరుపేద రోగులకు పౌష్టికాహారం అందించాలనే ప్రభుత్వ సంకల్పం గాంధీ ఆస్పత్రిలో నెరవేరడం లేదు. శతశాతం పెంచిన డైట్ ధరలు రాష్ట్రవ్యాప్తంగా అమలు అవుతుండగా, కోర్టు వివాదాలు, డైట్ కమిటీ నిర్ణయాల నేపథ్యంలో గాంధీ రోగులకు మాత్రం గత ఎనిమిది నెలలుగా పాత ధరలే కొనసాగిస్తున్నారు. స్టేట్ డైట్ కమిటీలో మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గాంధీ డైట్ ఫైల్‌కు మోక్షం కలగకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో డైట్ ఛార్జీలను పెంచుతూ గతేడాది మార్చి 21న రోగులు, సహాయకులు, ట్రైబల్ పేషెంట్లకు డైట్ ఛార్జీని రూ.40 నుంచి రూ.80, టీబీ, మెంటల్, థెరపెటిక్ పేషెంట్లకు రూ. 56 నుంచి రూ.112, డ్యూటీ డాక్టర్లకు రూ.80 నుంచి రూ.160కు పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అప్పటికి ఉన్న డైట్ కాంట్రాక్టులను రద్దు చేసి, నూతన ధరల ప్రకారం టెండర్లు పిలిచి, అర్హులకు డైట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించింది.

- గాంధీ ఆస్పత్రిలో డైట్ నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల కాలపరిమితితో 21 జనవరి 2022న చేపట్టామని 21, రెండు నెలలకే డైట్ నిర్వహణ రద్దు చేసి నూతన టెండర్లు ఆహ్వానించడం తగదంటూ సహస్ర సంస్థ కోర్టును ఆశ్రయించింది.
- మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గాంధీ పాలనాయంత్రాంగం నెల రోజుల వ్యవధి ఇస్తూ టెండరు రద్దు నోటీసులను సహస్ర సంస్థకు అందించారు. ఏప్రిల్ 16న నూతన డైట్ టెండరు దరఖాస్తులను ఆహ్వానించారు.
- సహస్ర సంస్థ మరోమారు కోర్టును ఆశ్రయించడంతో టెండరు ప్రక్రియ కొనసాగించాలని, ఫైనలైజ్ చేయవద్దని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.
- గాంధీ పాలన యంత్రాంగం ప్రభుత్వం తరుపున కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, వాదప్రతివాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 21న సహస్ర సంస్థ పిటిషన్‌ను కొట్టి వేస్తూ తుది తీర్పు ఇచ్చింది.
- అదే నెల 26వ తేదీన జడ్జిమెంట్ కాపీని అందుకున్న గాంధీ అధికారులు అడ్వొకేట్ జనరల్ సలహా, సూచనల కోసం పంపించారు.
- అడ్వొకేట్ జనరల్ సూచన మేరకు ఆగస్ట్ 27న టెండర్లు తెరిచి అర్హత పొందిన శివనారీ క్యాంటీన్ సర్వీసెస్‌కు డైట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.
- సహస్ర సంస్థ మరోమారు కోర్టులో అప్పీల్ చేయడంతో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరస్పర సహాయ సహకారాలతో సమస్యను పరిష్కరించుకోవాలని, ముందుగా డిస్ట్రిక్ డైట్ కమిటీలో చర్చించాలని, పరిష్కారం కాకుంటే స్టేట్ డైట్ కమిటీలో తేల్చుకోవాలని న్యాయస్థానం సూచించింది.
- జిల్లా డైట్ కమిటీలో పరిష్కారం కాకపోవడంతో గాంధీ అధికారులు అక్టోబరు 3న స్టేట్ డైట్ కమిటీని ఆశ్రయించారు. అప్పటి నుంచి గాంధీ డైట్ ఫైల్ స్టేట్ కమిటీలో పెండింగ్‌లో ఉంది.
- సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో గత ఎనిమిది నెలలుగా గాంధీ రోగులు, వైద్యులకు పెంచిన డైట్ ధరల ప్రకారం ఆహార పదార్థాలు సరఫరా కాకపోవడం గమనార్హం.
- తెలంగాణ వైద్యప్రదాయినీగా పేరుపొందిన గాంధీ ఆస్పత్రి డైట్ సమస్యను సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావుతో పాటు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే పరిష్కరించాలని రోగులు, వైద్యులు కోరుతున్నారు.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యం..

గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అందించే ఆహార పదార్థాల (డైట్) ధరలు పెంచి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంతవరకు అమలు చేయదు. బలవర్ధక, పౌష్టికాహారం అందకపోవడంతో రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూరడంలేదని, పెంచిన డైట్ ధరలు తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఓ కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించారు. మంగళవారం వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి కేసును ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు.

ఫైల్ పెండింగ్‌లో ఉంది..

గత ఎనిమిది నెలలుగా పాత ధరల ప్రకారమే గాంధీ రోగులు, వైద్యులకు ఆహారం అందిస్తున్నాం. డైట్ నిర్వహణకు సంబంధిచిన ఫైల్ స్టేట్ డైట్ కమిటీలో పెండింగ్‌లో ఉంది. కమిటీ ఇచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం. సమస్యను వైద్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

నిరుపేదల సంజీవని సీఎంఆర్ఎఫ్



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ సంజీవని అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడకు చెందిన రవికుమార్ సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 1.5 లక్షలకు సంబంధించిన పత్రాన్ని మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగులు ప్రసాదించిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం అండగా నిలబడి వారి వైద్య ఖర్చుల కోసం అవసరమైన నిధులను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

చిలకలగూడ: నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయు జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సీఐటీయు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 18 నుంచి 21 వరకు బెంగళూరులో జరిగే సీఐటీయు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో లేబర్‌కోడ్, చట్టాలతోపాటు పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయు సికింద్రాబాద్ జోన్ నాయకులు మధు, ఎల్లస్వామి, నర్సింగరావు, సురేష్, అజిబాయ్, సోమయ్య, ఆంజనేయులు, వెంకటేష్, నరేందర్, పాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు

చిలకలగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు జలమండలి మారేడుపల్లి జీఎం రమణరెడ్డి తెలిపారు. శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశం నిర్వహించి మంచినీటి సరఫరా వేళలు, లోప్రెషర్, కలుషిత జలాలు, నూతన పైప్‌లైన్ నిర్మాణంపై చర్చించారు. సీతాఫల్‌మండి సెక్షన్ కార్యాలయ ఆవరణలోని నీటి ట్యాంకును రూ. 5 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టామని వివరించారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో చేపట్టిన నూతన పైప్‌లైన్, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. సీతాఫల్‌మండి మేడిబావి డేడ్‌లాక్ బిల్డింగ్ వద్ద డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ. 16 లక్షలు మంజూరైనట్లు హేమ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్లు నవ్య, అన్విత్, ప్రియాంక పాల్గొన్నారు.

కేటీఆర్ దృష్టికి చెట్ల నరికివేత

సాక్షి ఎఫెక్ట్..

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో ప్రభుత్వ స్థలంలోని భారీ వృక్షాన్ని నరికివేసిన ఘటనపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతపై మంగళవారం 'చెట్లపై కొడ్డలి పెట్టు.. అధికారులు స్పందిస్తే ఒట్టు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పలువురు స్పందించారు. భారీ వృక్షాన్ని నరికివేస్తుంటే స్థానికులు సమాచారం అందించినా స్పందించకుండా సంబంధిత అధికారులు చోద్యం చూడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సాక్షిలో ప్రచురించిన కథనాన్ని మంత్రి కేటీఆర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, కార్పొరేటర్ హేమ, జీహెచ్ఎంసీ, ఫారెస్ట్ అధికారులకు ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా పంపించి ఫిర్యాదు చేశామన్నారు. చెట్లు నరికివేతపై కార్పొరేటర్ సామల హేమ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి క్లిప్పింగ్‌ను సంబంధిత అధికారులకు పంపించి ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఫారెస్ట్ అధికారులు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లబ్ధిదారుల చెంతకే ప్రభుత్వ పథకాలు



చెక్కులు అందజేస్తున్న పద్మారావుగౌడ్

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారుల చెంతకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉపకరించేలా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులు వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, కిరణ్, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగరాజు గౌడ్, చింతల్ లక్ష్మణ్, బల్‌రాం పాల్గొన్నారు.

ఆస్పత్రిని నిర్మించాలి..

లాలాపేట: ఓయూ క్యాంపస్ పక్కనే ఉన్న మాణికేశ్వర్‌నగర్(వడ్డెర బస్తీ)లో ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని బస్తీ వాసులు పద్మారావు గౌడ్ కోరారు. సుమారు 2 వేల జనాభా ఉన్న మాణికేశ్వర్‌నగర్‌లో ఇప్పటి వరకు హాస్పిటల్ లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో హాస్పిటల్ నిర్మాణం కోసం బస్తీలోని కమాన్ పక్కన కేటాయించిన స్థలం యూనివర్సిటీ అధికారులు తమదని అంటున్నారని, ఈ విషయమై దాదాపు 20 ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకుంటున్నామని పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి స్థల వివాదం పరిష్కరించి హాస్పిటల్ ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

అగ్నివీరులకు విద్యార్హత సర్టిఫికెట్లు

కంటోన్మెంట్: అగ్నివీరులకు మిలటరీ శిక్షణతో పాటు వివిధ విద్య, నైపుణ్య అర్హత సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నామని రక్షణ శాఖ అడిషనల్ డీజీ (మీడియా- కమ్యూనికేషన్) భరత్ భూషన్ అన్నారు. బొల్లారంలోని 1ఈఎంఈ సెంటర్ ఆవరణలో మంగళవారం జరిగిన మీడియా ఇంటరాక్షన్‌లో సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ సురేశ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. మార్చి నాటికి మొత్తం 36,000 మంది అగ్నివీర్‌ల నియామకం పూర్తవుతుందని ఇప్పటి వరకు తొలి బ్యాచ్‌లో 19,000 మంది నియామకవయ్యారని వారిలో 25 శాతం మందికి శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పిస్తున్నామని మిగిలిన 75 శాతం మందికీ నాలుగేళ్ల సర్వీసు అనంతరం పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

- ప్రతిష్టాత్మక ఆర్మీ శిక్షణ కేంద్రాల్లో 1ఈఎంఈ సెంటర్ ఒకటని కమాండెంట్ బ్రిగేడియర్ సురేశ్ తెలిపారు. తొలి బ్యాచ్‌లో భాగంగా 458 అగ్నివీరులకు 1ఈఎంఈ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరికి తొలి పది వారాలు సాధారణ మిలటరీ శిక్షణ, 21 వారాలు అడ్వాన్స్ మిలటరీ శిక్షణ ఉంటుందన్నారు. ట్రేడ్స్‌మెన్‌లకు మరో 14 వారాల అదనపు శిక్షణ ఉంటుందన్నారు. 21 వారాల టెక్నికల్ శిక్షణలో భాగంగా ఆటోమొబైల్ టెక్నీషియన్ / ఎలక్ట్రీషియన్ రంగాల్లో తర్ఫీదు ఇస్తామన్నారు.
- అడ్వాన్స్‌డ్ మిలటరీ శిక్షణలో భాగంగా కంప్యూటర్, కమ్యూనికేషన్, వెల్డర్, అర్టిసాన్ మెటలర్జీ, రిఫ్రిజిరేటర్ టెక్నీషియన్‌లుగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.
- ఫ్లయింగ్ సిఖ్ మిల్కాసింగ్ ప్రాతినిథ్యం వహించిన 1ఈఎంఈ సెంటర్‌లో అగ్నివీరులకు అత్యుతమ, ఆధునిక సాంకేతికతతో కూడిన శిక్షణ ఇస్తామన్నారు.
- ఈ ఈఎంఈ సెంటర్ నుంచి సుబేదార్ మహ్మద్ హుస్సాముద్దీన్ బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్, ఆసియన్ ఎలైట్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించినట్లు తెలిపారు. క్రాఫ్ట్‌మెన్ నితి వాటర్ పోలోలో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించగా, క్రాఫ్ట్‌మెన్ జీనో ఆంథోనీ మారథాన్‌లో పలు అవార్డులతో పాటు 24 గంటల్లో 238 కిలోమీటర్లు పూర్తి చేసి సరికొత్త రికార్డు సాధించినట్లు తెలిపారు.

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

అమీర్‌పేట: నేత్రాలకు సంబంధించి ఎలాంటి సమస్య తలెత్తినా నిర్లక్ష్యంగా ఉండరాదని బల్కంపేట శంకర నేత్రాలయం ఎండీ డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు.బీకేగూడ మున్సిపల్ పార్కు వద్ద బల్కంపేట, లయన్స్ క్లబ్ సనత్‌నగర్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రతి బస్తీ, కాలనీల్లో శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అన్నారు. తహసీల్దార్ విష్ణుసాగర్ నాయకులు అశోక్‌యాదవ్, సత్యనారాయణ యాదవ్, ఖాద్రీ పాల్గొన్నారు.

సొంతూళ్లకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

సనత్‌నగర్: సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ సనత్‌నగర్ పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆటోలు, కరపత్రాలు, బ్యానర్లు, మైక్‌ల ద్వారా సూచనలు చేస్తూ బస్తీ, కాలనీ నివాసితులను అప్రమత్తం చేస్తున్నారు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ నేతృత్వంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ పైడినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది సనత్‌నగర్, ఎస్ఆర్‌టీ కాలనీ, జెక్‌కాలనీ, ఎర్రగడ్డ, మోతీనగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఊరికి వెళ్లేవారు తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారం, సెన్సార్‌ను అమర్చుకుంటే మంచిదన్నారు. విలువైన నగదు, ఆభరణాలు బ్యాంకు లాకర్లు, తెలిసిన వారి వద్ద భద్రపర్చాలన్నారు. కాలనీ, బస్తీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, లేదా 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. స్వగ్రామాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

డిగ్రీ పరీక్షల విధులను బహిష్కరిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఫిబ్రవరిలో జరిగే డిగ్రీ సెమిస్టర్ పరీక్షల విధులను బహిష్కరిస్తామని తెలంగాణ డిగ్రీ కాలేజీల లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. పరీక్షల విధుల పారితోషికాన్ని పెంచాలని వీసీ, రిజిస్ట్రార్, ఎగ్జామినేషన్ కంట్రోలర్‌కు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల పరీక్షల ఫీజులను పెంచినా అధ్యాపకుల పారితోషికాన్ని పెంచడం పోవడం దారుణమన్నారు. మూడు గంటల ఇన్విజిలేషన్ విధులకు పదేళ్లుగా రూ.150 మాత్రమే చెల్లిస్తున్నారని పెరిగిన ధరలకు అనుకూలంగా రూ.500లకు పెంచాలని డిమాండ్ చేశారు.

తవ్విన రోడ్డు నిర్మాణం చేపట్టాలి

సికింద్రాబాద్: పైపులైన్ మరమ్మతుల కోసం గత తొమ్మిది నెలల క్రితం రోడ్డును తవ్వి వదియడంతో గుంతలమయంగా మారిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలువురు నాయకులు సీతాఫల్‌మండి డివిజన్ బీదల బస్తీలో గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. ప్రమాదకరంగా మారిన రోడ్డుతో పాదచారులు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ గిరి,ధనుష్, రాజు, వెంకటేష్, సాయినాథ్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి తవ్వకాలు.. అడిగేదెవరు ?

- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో రోడ్లపై తవ్వకాలు
- రాత్రి సమయంలో డ్రైనేజీ, తాగునీటి కనెక్షన్లు
- గుంతలమయంగా రహదారులు



పద్మారావునగర్ ఈద్గా మైదానం ప్రధాన రహదారిలో అర్ధరాత్రి చేపట్టిన తవ్వకాలు

బన్సీలాల్‌పేట్: అధికారుల పర్యవేక్షణ లోపంతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తున్నారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల అండదండాలతో కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తిపడి ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు ప్రయోజనం కలిగించేలా జలమండలి కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రీ, పగలు తేడా లేకుండా రోడ్లపై తవ్వకాలు చేస్తున్నారు. రాత్రికి రాత్రి తవ్వకాలతో తమ పని పూర్తి చేసుకుంటూ సదరు కాంట్రాక్టర్లు రోడ్లను గోతులమయంగా మారుస్తున్నారనే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణాదారులతో ఎంతో కొంత మాట్లాడుకొని అక్రమంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌లు ఇస్తున్నారు. మారేడ్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ కార్యాలయాల పరిధిలో రోడ్ల అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. జలమండలి బోయిగూడ, శ్రీనివాస్ నగర్, హుస్సేన్‌సాగర్ సెక్షన్ పరిధిలో అక్రమ తవ్వకాలకు అదుపు లేకుండా పోయింది.

రాత్రి సమయంలో భారీ శబ్దాలతో..

బోయిగూడ, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, జీరా, రాణిగంజ్, బోలక్‌పూర్, గాంధీనగర్, మోండా మార్కెట్, బండిమేట్, శ్రీనివాస్‌రావు నగర్, అభినవ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అక్రమ రోడ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పద్మారావునగర్ ప్రధాన రహదారి ఈద్గా మైదానం మార్గంలో ఈ నెల 9 అర్ధరాత్రి జలమండలి రోడ్లు తవ్వకాలు సాగించారు. భారీ శబ్దాలతో రోడ్లపై తవ్వకాలు సాగించడంతో స్థానిక అపార్టుమెంట్ వాసులు పోలీసులకు ఫోన్ చేశారు. అర్ధరాత్రి పోలీసులు వచ్చి సదరు తవ్వకాలను నిలిపేశారు. ఈ విషయమై జలమండలి అధికారులతో స్థానికులు ఆరా తీయగా ఓ జలమండలి కాంట్రాక్టర్ ఓ ఇంటి యజమానితో మాట్లాడుకొని డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వడానికి తవ్వకాలు సాగించారనే విషయం బయట పడింది.

కాంట్రాక్టర్ల చేతివాటం?

జలమండలికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా రోడ్లపై తవ్వకాలు సాగిస్తూ భారీ మొత్తంలో కాసులు దండుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు స్థానిక నాయకుల సహకారంతో జలమండలి కాంట్రాక్టర్లు రోడ్లుపై తవ్వకాలు సాగిస్తున్నారు. ఇందు కోసం సదరు వ్యక్తుల నుంచి రూ. 50 నుంచి 60 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతన నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు.

అనుమతి లేని తవ్వకాలపై చర్యలు

తమ అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టి డ్రైనేజీ, మంచినీటి కనెక్షన్లు ఇస్తే సదరు కాంట్రాక్టర్లపై కఠినంగా వ్యవహరిస్తాం. నిబంధనలు ఉల్లంఘించి జలమండలి ఆదాయానికి గండి కొట్టే వారి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అక్రమ తవ్వకాలను ప్రజలు తమ దృష్టికితీ సుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– వెంకట్రావ్, జలమండలి డిప్యూటీ జీఎం

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి

అడ్డగుట్ట: నగరంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు విద్యార్థులందరికీ వారి వారి తరగతికి తగిన విద్యా సామర్థ్యాలను పెంపొందించాలనితల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. మారేడుపల్లి మండల పరిధిలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్లో తల్లుల సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు తరగతికి తగిన విద్యా సామర్థ్యాలు అందడం లేదన్నారు. మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో స్లో లర్నర్స్‌కి రెమిడియల్ సెంటర్స్ నడుస్తున్నాయని, ఆ సెంటర్లను సందర్శించి అందులోని సమస్యలను గుర్తించి అధికారులకు పిటీషన్ ఇవ్వాలని సంఘం సభ్యులకు సూచించారు. బడీడు పిల్లలను బడులకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారయణ, లక్ష్మి, శోభ, బాలమణి, స్వరూప, హాజీబేగం,పుష్ప, స్వప్న, సుజాత పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు, బైక్ ఢీ.. యువకుడి మృతి

రసూల్‌పురా: ట్రావెల్స్ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రవణ్‌కుమార్ వివరాల ప్రకారం.. అల్వాల్ రోడ్ డైరీఫాం ఆనం గార్డెన్స్ ప్లాట్ నంబర్–103 లో ఉండే విక్రమ్ శరణ్ (27) బేగంపేట ఎయిర్‌ఫోర్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం రామకృష్ణపురం నుంచి ఇంటికి తన బైక్‌పై వెళ్తున్నాడు. తిరుమలగిరి చౌరస్తా సమీపంలో సికింద్రాబాద్ వైపు నుంచి తిరుమలగిరి వైపు వస్తున్న సాజన్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీ కొనడంతో విక్రమ్ శరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

త్వరలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలోని ధనియాలగుట్ట శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేసి అందుబాటులో తీసుకురానున్నట్లు కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. అన్ని రకాల సదుపాయాలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అవసరమైన చోట్ల మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల అభివృద్ధి పనులను శరవేగంగా జరుపుతున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ వెంట ఈఈ సుదర్శన్, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్, సత్యనారాయణ ఉన్నారు.